# జీవించవలసిన జ్ఞాపకం ఆయన, భిన్న వ్యక్తిత్వం ఆయన సొంతం – అజయ్ గుడవర్తి

(29 అక్టోబర్ 2019, వార్త)

మానవ హక్కుల వేదికకు పది సంవత్సరాలు నిండిన సందర్భంగా అటువంటి సంస్థను నిర్మిచడం ఎలా జరిగిందని బాలగోపాల్‌తో నా చివరి సంభాషణల్లో అడిగాను. సంస్థ నిర్మాణం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకూ వ్యాపించిందిగాని, మొత్తంగానే ఆదర్శ వాదం వెనకపట్టు పడుతున్నదని ఆయన జవాబిచ్చారు. పోరాటాలను ప్రారంభించడానికి, కొనసాగించ డానికి ఒకరకమైన సంకోచం, అయిష్టం ఉన్నాయని ఆయన అన్నారు. తర్వాత కాస్త ఆలోచించి, బహుశా పోరాటాలు కొనసాగాలంటే ఎంతో కొంత అమాయకత్వం కూడా ఉండాలేమో అని కలిపారు. బాలగోపాల్ స్వయంగానే ఇటువంటి ఆమాయకత్వాన్ని, నిజాయితీతో సహా, కాపాడుకున్నట్టున్నారు. ఏదయినా ఒక విషయానికి తాను ఇవ్వ గలిగినదంతా ఇచ్చే అరుదయిన సాహసం ఆయన సొత్తు. ఆయితే అదే సమయంలో ఆ విషయం ఏమి కాబోతున్నదో కూడా ఆయన చాలా కచ్చితమైన అంచనా వేయగలిగేవారు.

వాస్తవమేమంటే ఆయన వేసే ఆ అంచనా ఏదయినా ఒక సమస్యలో, సంస్థలో, ఉద్యమంలో ఆయన భాగస్వామ్యాన్ని ఎప్పుడూ పెద్దగా ప్రభావితం చేయలేదు. ఆయనలో ఒక మేధావికి ఉండే నిశితమైన కుతూహలం, ఒక కార్యకర్తకు ఉండే ఏకాగ్రత కలిగలిసాగాయి. ఏ సిద్ధాంతకర్తకయినా తప్పనిసరిగా ఉండవలసిన మేధో కుతూహలం అది. భావాలు, ఆదర్శాలు నిత్య చలనంలో ఉంటాయని అంగీకరించే ఓపిక అది. ఒక సుదూర లక్ష్యాన్ని అన్వేషిస్తూ అంత దూరమూ నడిచే స్థిర నిశ్చయం చేసుకుని, ఇప్పటికిప్పుడు ఇక్కడిక్కడి రాజకీయాలలో సాధించగలిగిన దాన్ని సాధించాలనే ఆదుర్దా అది. సాధారణంగా విప్లవ రాజకీయాలలో ఒక అఖాతం ఉంటుంది. తెలియని దానికోసం, లేదా ఇంకా తెలియని దానికోసం కష్టాలు పడుతూ, అయినా సొంత నమ్మకాలపట్ల అకుంఠితమైన నిబద్ధత కలిగి ఉండడం అది. ఆ అఖాతాన్ని ఆయన అధిగమించినట్టు కనబడుతుంది.

ఆయన ఏమి మాట్లాడారో అదే జీవించారు. సుదూరమైన ప్రజాసమూహాన్నీ, అతి సన్నిహితమైన వ్యక్తిగతాన్నీ ఆయన కలగలిపారు. అధిగమించడం అసాధ్యం అనిపించే వైరుధ్యాలను సులభంగా దాటడం ఆయన అలవాటు చేసుకున్నట్టున్నారు. ఆ సౌలభ్యం ఎంతటిదంటే, అది అసలు కనబడేదే కాదు.ఆయనను అతి నిశితంగా పరిశీలిస్తే తప్ప అది తెలిసేది కూడా కాదు. ఒకప్పుడు స్పష్టంగా, ఒకప్పుడు అస్పష్టంగా ఉన్న అసంఖ్యాక వైరుధ్యాల వెంటబడి పోలేదాయాన. వాటిలో మునిగిపోయారు. సామాజికతకు దూరంగా ఉండే అధికారిక

స్థానాన్ని తనకోసం నిలిపి ఉంచుకోవడాన్ని జాగ్రత్తగా దాటవేసిన ఆ వ్యక్తి తన విశాల పరిధిలోకి వచ్చిన ప్రతి దానిమీదా చెరపరాని ముద్రను వదిలారు.

**ప్రపంచానికి పౌర హక్కుల కార్యకర్త అనే తెలుసు**

బాలగోపాల్ అంటే ప్రపంచానికి తెలిసినది ఒక పౌరహక్కుల కార్యకర్త అని, కాని ఆయనది అంతకు మించిన వ్యక్తిత్వం. అది చాలా సంక్లిష్టమైనది. ఆయన తనలోపల నిక్షిప్తం చేసుకున్న అపారమైన విషయాల నుంచి ఆ సంక్లిష్టతను జాగ్రత్తగా వెలికితీయాలి. అలా అన్నిటినీ తన లోపల జీర్ణం చేసుకుని ఆయన అసాధారణంగా కనబడకుండా ఉండడానికి ప్రయత్నించారు. ఎంత సాదాగా వీలయితే అంత సాదాగా కనబడడానికి ప్రయత్నించారు. ఈ సాధారణత్వం కోసం ఆయనపడిన నిరంతర తపన ఆయనకేమీ సహజంగా రాలేదు. అది ప్రపంచానికి ఆయన గురించి ఎంత తెలియజెప్పిందో అంత దాచింది కూడా. ఆయనలో దాచుకున్న ఈ ప్రపంచాన్ని తెరవడానికి తాళపుచెవి ఆయన దగ్గర ఉందేమో అని ఒకసారి ఆయనను అడిగాను– "ఇంతగా ఎప్పటికీ కరిగిపోని శక్తులు మీకు ఎక్కడినుంచి వస్తాయి" అని. ఆయన ఒక చిరునవ్వు నవ్వారు.

ఈ చిరునవ్వును నేనెప్పటికీ మరచిపోలేను, ఆ చిరునవ్వు అటువంటి జీవితం మీరు కూడా గడపండి అని ఆహ్వానించే చిరునవ్వు. ఆ ఆహ్వానమే ఆ వ్యక్తి గురించి క్లుప్తంగా తెలియ జేసిందనుకుంటాను. అది మనందరికీ తెలిసిన సామాజిక తర్కాన్ని తలకిందులు చేసే వ్యక్తిత్వం. బహుశా ఆయన వివరాల కోసం వ్యగ్రంగా వెతుకుతూనే స్థితప్రజ్ఞతో కూడిన నిర్మలత్వం కోసమూ ప్రయత్నించారని పిస్తుంది. ఒక క్రమానికి దోహదం చేస్తూనే దాని నుంచి ఏమీ కోరని వ్యక్తిత్వం అది. ఈ ప్రయత్నమే ఆ వ్యక్తి లేకపోయినా ఫరవాలేదనే అభిప్రాయపు ఛాయను కలిగిస్తుంది. తనకు తానే ఒక స్థావరంగా మారకుండా ఉండే పోరాటాన్ని, వ్యక్తి అస్పష్టంగా మారిపోయి, కేవలం చేతిలో ఉన్న కర్తవ్యంమీద మాత్రమే దష్టి నిలపడాన్ని సాధిస్తుంది.

**అవిశ్రాంత పోరాటం**

ఆయన ఆదుర్దా అంతా అధికారాన్ని అన్ని రూపాల్లోనూ ఎదిరించడం. ఆ అధికారం తనచుట్టూ పోగుపడే కనీస అవకాశాన్ని కూడా ఇవ్వని స్వభావాన్ని ఆయనకు సహజమయి పోయేంతగా తనలో భాగం చేసుకున్నట్టున్నారు. ఈ స్వభావానికి ఉండే అన్ని స్థలకాల కోణాలలోనూ ఆయన జీవించారు. బాధపట్ల ఆయన వైఖరి దాన్ని మరొక రకంగా కూడా అనుభవించవచ్చునని చూపింది. మందకొడిగా పనిచేయడానికి ఆయన ఎప్పుడూ సిద్ధపడలేదంటే, రాజ్యహింసతో సహా అంత స్పష్టంగా లేనివాటిదాకా పెరిగిపోతున్న అన్ని హింసా రూపాలపట్ల ఆయన ఆందోళన ఎంత కారణమో, కనబడకుండాపోయిన అహాన్ని, తిరిగి రావడానికి వేచిచూస్తున్న అహాన్ని అడ్డుకునే ప్రయత్నం కూడా అంతే కారణం కావచ్చు.

అతి ప్రాథమిక స్థాయిలో ఆచరణ అంటే ఆయన చెప్పుకున్న అర్థానికి ఈ రెండు అంచుల ప్రయత్నం ఉంది. ఆ ఆచరణ అవిశ్రాంతంగా, నిరంతరంగా సాగవలసిందే. అధికారపు చీకటి కోణాలను వెలికితీసే ఆయన కార్యక్రమం ఎల్లప్పుడూ మానవులలో అత్యుత్తమమైన, సన్నిహితమైన, ప్రేమాస్పదమైన అంశాలతో కలిసి, జాగ్రత్తగా రూపుదిద్దుకుంది. 'పీడనను ఖండించడమంటే, ఎవరికి వాళ్ళు తమలో ఒక చిన్న భాగాన్నయినా ఖండించుకోవడమే' అని ఆయన ఒకచోట రాశారు.

మొక్కవోని వ్యక్తిత్వాన్ని, కాని అదేసమయంలో అస్పష్టమైన వ్యక్తిత్వాన్ని వెతకడమంటే వ్యవస్థీకతమైన అధికార నిర్మాణాలతో వ్యవహరించే విప్లవ నిరసన రాజకీయల బహిరంగ రూపాలు ఎక్కడ మచ్చపడతాయోనని ఆందోళన చెందడమే. విమర్శ అనే అతి సాధారణమైన చర్చ కూడా ఈ లోతయిన ఆందోళన పునాదిమీద లేకపోతే, వ్యతిరేకతా భావాల ఛాయలు మిగులుస్తుందని ఆయన హెచ్చరించారు.

### గుండె ధైర్యమే ఆయన ఆయుధం

'బలప్రయోగం ద్వారా అధికారాన్ని సాధించడం మినహాయించి, ఏదయినా విమర్శనాత్మక ఆచరణ కాకపోతే, కేవలం విమర్శనాత్మక దక్పథం పరివర్తనా కక్షికి మార్గదర్శకంగా పనిచేయ జాలదు' అని ఆయన నమ్మారు. తన కోసం ఆయన అత్యంత కఠినమైన ప్రమాణాలను నిర్ణయించుకున్నారు. ఆటంకాలు విపరీతంగా ఉన్నప్పుడు, పరిణామాలు తీవ్రంగా ఉన్నప్పుడు నిర్దాక్షిణ్యమైన విమర్శ సాగించడంలో ఆయనకు ఆయనే సాటి అనిపించేంత ఉత్తమంగా ఉన్నారు. ఎంతమూల్యం చెల్లించవలసి వచ్చినా సరే అనే సంసిద్ధత మాత్రమే విమర్శలో దాగి ఉండే ప్రతికూల భావనను, దానితో కలిసి ఉండే అహాన్ని వదల్చగలుగుతుంది. ఈ సంసిద్ధత ప్రామాణికమైన గాంధీవాద వైఖరిలా కనబడుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో చట్ట వ్యతిరేక హింసకు పాల్పడిన పోలీసు అధికారుల పేర్లను బయట పెట్టడంలో, వారిమీద హత్యానేరాన్ని మోపాలని కోరడంలో, మాఫియా నిగూఢపాత్రను, పోలీసులు నియమించిన కిరాయి హంతకులను, వారితో సంబంధం ఉండే భూవివాదాల మాఫియా పాత్రను వెలికితీయడంలో ఆయన ఒంటిచేత్తో పనిచేశారు. చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి తమ అధికారంలో అత్యున్నత స్థానాలలో ఉన్నప్పుడు, ఆ గందరగోళం ముగిసిపోక ముందు, ఆ గందరగోళాన్ని వాడుకుని వారు మరిన్ని ఘోరాలు చేయకముందే వారికి వ్యతిరేకంగా అద్భుతమైన వ్యాసాలు రాశారు.

### మృత్యువు పట్ల ఉదాసీనత

ఆయన మృత్యువు ఎంతమాత్రమూ గుర్తించని పద్ధతిలో వస్తుందేమో అనే అనుమానం నాకు ఎన్నోసార్లు కలిగింది. అది కేవలం మనం నివసిస్తున్న రాజ్యాంగబద్ధమైన రాజ్యం వల్ల మాత్రమే కాదు. మృత్యువుపట్ల ఆయనకు ఉండిన అతి సాదా, నిర్లిప్తమైన వైఖరివల్ల కూడా. ఆయన కటువైన పరిహాసాన్ని ఈ మృత్యువు విషయానికి అట్టే పెట్టుకున్నారు. కృష్ణానది మీద ఒక అందమైన స్థలాన్ని వెతికి పెట్టుకున్నానని, తనకేదయినా ప్రాణాంతకమైన జబ్బు చేస్తే, అక్కడి నుంచి దూకి చనిపోతానని ఆయన ఒకసారి మాతో అన్నారు. జీవనశైలివల్ల తనకు ఏ విషయంలోనూ ఏ హామీ లేదని ఆయనకు తెలుసు. బతుకుమీద మృత్యువు కలిపించే భయం నుంచి విముక్తి సాధించడమే ఆయన సాధించిన విముక్తి. అది సంపూర్ణమైనది. విశాల చరిత్ర గమనంలో వర్తమానం అనే దానికి చాలా క్షణికమైన, చలనశీలమైన స్వభావం ఉందనే అవగాహనతోనే ఆయన విముక్తి రచన జరిగింది.

చరిత్ర అన్నిటినీ సమానం చేయగల శక్తి కలిగినది. అలాగే అతి విలువైన కానుకలను తనలో సంలీనం చేసుకుని మున్ముందుకు సాగిపోగలిగినది. భావితరాలకు వనరుగా ఉపయోగపడగల జ్ఞాపకశక్తిని కలిగి ఉన్నది. అదే సమయంలో అది ప్రయత్నిస్తేనే కనబడేంత సుదూర దిగంతాన్ని కలిగిన బలహీనమైనది కూడా. అవసరం వచ్చినప్పుడు ఒంటరిగా నిలబడే సహనశీల సంసిద్ధత, కనబడకుండా వెనుక వరుసలో ఉండిపోయే సంసిద్ధత ఆయనకు ఎంత సహజంగా అబ్బాయంటే అవి ఎవరి దృష్టికి రాకుండానే ఉండిపోయాయి. ప్రజా ఉద్యమాలలో భాగం అవుతూ, విశ్రాంతిలేని ప్రజాజీవనం గడుపుతూనే ఆయన అనామకుడుగా ఉండే అవకాశాన్ని కూడా అనుభవించి, ఆనందించారు.

పొగడ్తలను సహించలేదు. కీర్తి ఆకర్షణలను పక్కకు తోశారు. మనం పోరాడే ఆదర్శాలు గొప్పవి గనుక, స్వీయ ప్రచారం చేసుకోవచ్చుననీ, ప్రతినిధులుగా ఉండవచ్చుననీ అనుకునే ధోరణులు మన చుట్టూ సంస్థానిర్మాణాల సంస్కృతిలో భాగమయినప్పుడు ఆయన దాన్ని వినోదంలా చూశారు. ఇతరులు సొంతంగా ఎదగగలిగిన, నేర్చుకోగలిగిన స్థలాలలోకి దురాక్రమించగూడదని ఆయన జాగ్రత్తపడ్డారు. ఇతరుల కోసం నిలబడ్డానని అనుకునే బదులు, ఇతరులతో కలిసి ఉండడంకోసం ఆయన వెనక్కితగ్గారు. ఔదార్యపు ఏకీభావం కన్న విమర్శనాత్మక చర్చ గౌరవప్రదమయినదని ఆయన అనుకున్నారు.

**వ్యక్తిగత జీవితంలో విప్లవ భావాలు భాగమే**

వెనక్కి తిరిగి ఆలోచిస్తే, విప్లవ భావాలు అనేవి మనం నిర్మించే ఉమ్మడి సామాజిక నేపథ్యంలో ఎంత భాగమో, వ్యక్తిగత ప్రయత్నంలో కూడా అంతే భాగమనిపిస్తుంది. ఆ ప్రయత్నం తన సూత్రాలను తానే తయారుచేసుకుంటుంది. పర్యవసానాలు ఎలా ఉన్నా వీటిని ఏమరకుండా పాటిస్తుంది. ఆ సూత్రాలలో

కొన్నిటినైనా మనలో సంలీనం చేసుకోవడం, వ్యక్తిగతంగా ఆచరించడం అవసరమనిపిస్తుంది. అలా జరగనట్టయితే సామాజికమైన దాన్ని వ్యక్తిగతానికి అనువదించుకోవడంగాని, వ్యక్తిగతస్థాయిలో దాన్నికాపాడడం గాని సాధ్యం కాదేమో.

కొన్నిరకాల ఒంటరితనం రూపాలు బూర్జువా ఏకాంతభావనను మించి ఉంటాయని తనతో తాను సంతృప్తిచెందిన ఆత్మఉంటుందని, విప్లవ నిరసన అనే సుదీర్ఘయాత్రలో ఆ ఆత్మ భాగంకావడమనేది చాలా ఎక్కువసార్లు అర్థాంతరంగా, అనూహ్యంగా ఆగిపోవచ్చుననీ, అది ఇతరులను నిరాశలో, నిర్లిప్తతలో ముంచవచ్చుననీ బాలగోపాల్ అనుకున్నట్టున్నారు.

**భిన్న వ్యక్తిత్వం ఆయన సొంతం**

ఈ ఔదార్యం, నాయకులమీద ఆధారపడడం అనే సంబంధాలతో నిండిన సమాజంలో, ఆ నాయకత్వం మనందరినీ మౌన ప్రేక్షకులుగా దిగజార్చగలిగిన శక్తి గలదయినప్పుడు ఆయన ప్రవర్తన నిర్లిప్తత అని పొరబడేవిధంగా ఉండేది. ఆయన పనులు చేసే పద్ధతిలో, అతి కటువైన వ్యాఖ్య చేసిన తర్వాత చేతులు కట్టుకునే పద్దతిలో, ఉపన్యాసాలు ఇచ్చే పద్ధతిలో ఒకరకమైన క్లుప్తత, అవసరమయినంత మాత్రమే ఇవ్వాలనే స్పృహ కనబడుతుండేవి. న్యాయస్థానంలో వాదనలలో కూడా ఆయన అలాగే ఉండేవారట. ఆయనతో గడిపిన సమయాలలో చాలామందికి ఒకే క్షణంలో సాన్నిహిత్యం, భయం, ఉత్సాహం, నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన కలిగేవి. ఆయనతో స్నేహం, సాన్నిహిత్యం కలగాలంటే అది పరస్పర సంబంధమో, మరేమైనా బంధాలో కానక్కరలేదు. తెలియని మనుషులపట్ల కరుణతోనే ఆయనతో సంబంధం సంపన్నమయ్యేది. ఆ కరుణ ఏ ఒప్పందపు పునాది మీదా ఆధారపడినదికాదు. అది మిమ్మల్ని చుట్టుముట్టి మీ గౌరవాన్ని కాపాడేది. అది మీతో ఉండేది. అది మీలోనే ఉండేది. ఆయన నిగూఢమైన హావభావాలు కూడా వ్యక్తి గురించి కొత్త ఆలోచనలు చేయవలసిన అవసరానికి వ్యాఖ్యగా నిలుస్తాయి.

బాలగోపాల్ ప్రపంచం తలకిందులదీ, అదశ్యమైనదీ అయితే దానికి ఆయన రాజకీయాలతో, ఆ రాజకీయాలలో నైతిక ప్రమాణాల గురించి పెరిగిపోతున్న తపనతో సంపూర్ణమైన సంబంధం ఉంది. ఆయనది త్యాగాన్ని కీర్తించిన ఆచరణకాదు. అది ఆచరణను కీర్తించిన త్యాగం. వ్యవస్థల సంక్లిష్టతలను సాధారణమైన, అర్థంచేసుకోగలిగిన విలువలుగా చూడకపోయినట్టయితే, అవి విభిన్న అనుభవాలో, జీవితాచరణలలో భాగం కాలేకపోతాయని ఆ ఆచరణ నమ్మింది. అలా చూడకపోతే అవి సుదూర ప్రజాసమూహాన్ని సృష్టిస్తాయి. అధిగమించడానికి వీలులేని అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకున్న అభేద్యమైన వ్యవస్థలుగా కనిపిస్తాయి. రాజకీయ ఆచరణ అనేది, ఎంత విప్లవాత్మకమైనదయినా, దైనందిన జీవితం మీద ఆధారపడిన అనువర్తిత నిర్ధారణ

మాత్రమే. జీవితాచరణే అన్నిటికన్నా ప్రధానమైనది. అది మనం సష్టించదలచుకున్న దానికన్న భిన్నమైన అవగాహనను తయారుచేస్తుంది. వ్యక్తిగతం అనేదానితో బాలగోపాల్ రాజకీయం అనేదాని గాలి తీశారు.

మళ్ళీ వ్యక్తిగతం అనేదాన్ని కూడా నిరాడంబరత్వం, వినయం అనే వాటితో బద్దలు చేశారు. సమయం పాటించకపోతే, తన కొడుకుకు పాఠం చెప్పవలసిన సమయం వరకు నిరీక్షణలో పెడితే మంత్రులతో సమావేశాలను కూడా ఆయన వదులుకున్న సందర్భాలున్నాయి. ఆయన తనమీద తాను, సహచరులమీద, ప్రజా జీవితంలో వ్యక్తి ఆరాధనకు దగ్గరగా పేరు తెచ్చుకున్న వాళ్ళమీద వేళాకోళాలాడేవారు. ఎంతమాత్రం ఊహించని దగ్గర అత్యంత స్వల్పమైన వివరాలు పరిశీలించేవారు. పాత ఆదర్శాలు సరిపోనప్పుడు కొత్త ఆదర్శాలకు నిలిచేవారు. హక్కుల పరిభాష, చట్టబద్ధపాలన, సామాజిక న్యాయాన్ని, ఇతర అంశాలను హామీ ఇచ్చిన రాజ్యాంగంవంటి ఇప్పటికే సాధించిన విజయాలను కాపాడుకోవలసిన అవసరాన్ని గుర్తించారు. జీవనసరళి, సంస్కృతి వంటి ప్రతి అద్భుతమైన, బలహీనమైన దాన్నీ కాపాడడానికి ప్రయత్నించారు. ఆయన కలకత్తా పర్యటన నాకింకా స్పష్టంగా గుర్తుంది.

అప్పుడు నేను పనిచేస్తుండిన విశ్వవిద్యాలయంలో మాట్లాడమని నేను ఆయనను ఆహ్వానించాను. ఆయన ఉపన్యాసం అయిపోయాక నాలుగు గంటలపాటు ఎటో నడిచి వచ్చారు. నగరంలో బహిరంగస్థలాల్లో రికామీగా సాగే సంభాషణలు తనకు నచ్చాయన్నారు. (అదే సమయంలో ఆయనకు ఢిల్లీ ఎంత మాత్రం నచ్చలేదు. అక్కడ ప్రతి ఒక్కటీ బిగ్గరగా, ముఖం మీద కొట్టినట్టు ఉంటుందని, ఒక్కరోజు గడపడం కూడా కష్టమని అన్నారు). సుదీర్ఘ సంభాషణలంటే ఎంతమాత్రం ఇష్టం లేని వ్యక్తి అలా భావించడం ఆశ్చర్యమే.

మన చుట్టూ ఉన్న అసహ్యాకరమైన దారిద్ర్యం మీద పోరాడటం ఎంత ముఖ్యమో ఇప్పుడే ఇక్కడే ఉన్న మంచిని ఆస్వాదించడం కూడా అంతే ముఖ్యం అలా కాకపోతే, పోరాటాలు కూడా తమను తాము పునర్నిర్మించుకోవడానికి అవసరమైన సానుకూల శక్తిని కోల్పోతాయి. ఈ పునర్నిర్మాణం అనేది అన్యాయానికి వ్యతిరేకంగా సాగే పోరాటపు ప్రత్యక్ష పర్యవసానంగా చూడడం తప్ప, అన్యాయమైన సామాజిక నిర్మాణాలను కూలదోయడానికి అవసరమైన శక్తి తనంత తానే సమాజాన్ని న్యాయమైన పునాదిపై పునర్నిర్మిస్తుందని అనుకోవడం భ్రమ అని ఈ శతాబ్దపు చరిత్ర తగినంగా తెలియజేసింది అని ఆయన అన్నారు.

బాలగోపాల్ జీవితం ద్వారా చెప్పినట్టే మరణం ద్వారా కూడా చెప్పదలచుకున్నది చెప్పారు. ఆయన మరణం అర్థాంతరం ఆయన కర్తవ్యం అసంపూర్తిగా మిగిలింది. అసలు ఇటువంటి జీవితానికి సంపూర్ణంగా అనేదేదయినా ఉంటుందా? ఆయన మరణం మిగిల్చిన వేదనను అధిగ మించడానికి నిస్సందేహంగా చాలాకాలం పడుతుంది. కాని ఆ వేదననలో నేను ఒంటరిగా లేను, ఆ వేదన ఆయన కార్యకలాపాలలో

ఆయనతో సంబంధంలోకి వచ్చిన సంస్థలకూ, వ్యక్తులకూ మాత్రమే పరిమితమయిలేదు. ఆయన అవిశ్రాంత కార్యాచరణవల్ల జీవితాలు మెరుగుపడిన అనే ప్రజాసమూహాలకు మాత్రమే ఆ వేదన పరిమితం కాలేదు. ఆయన గురించి తెలియనివాళ్ళు, కేవలం విని ఉన్న వాళ్ళు కూడా ఆ వేదనలో మునిగిపోయారు. ఆయన వ్యక్తిగతంగా తెలియని మిత్రులు కూడా తాము ఏదో అర్థంకాని లోటును అనుభవిస్తున్నామని చెప్పడం విశేషం. గత కొద్ది రోజులుగా తెలుగుపత్రికలలో ఎన్నో జీవనరంగాల వ్యక్తులు తమ జీవితాలు, తమ చుట్టూ ఉన్నవారి జీవితాలు ఎట్లా ఒక్కసారి ఆగిపోయాయో వివరించారు.

వెల్చేరు నారాయణరావు అన్నట్టు పట్టపగలు చీకటి ముసిరినట్టుంది. చెప్పాలంటే బాలగోపాల్ రాజకీయాలు ఉన్నప్పటికీ తనదయిన సమూహం లేదు. ఆయన లేనిలోటు ఆయన చేసిన పని గురించి మాత్రమే కాక, ఆయన చేసిన పద్ధతి గురించి కూడా కావచ్చు ఆయన జ్ఞాపకాన్ని మళ్ళీమళ్ళీ పునర్జీవించవలసి ఉంది. ఆయన లోపల ఉండిపోయిన ప్రపంచం ఇక మనది. మనం నిర్మించవలసినది. బాలగోపాల్ మనం చేస్తున్న పనులనే భిన్నంగా చేయవచ్చునని నిరూపించారు గనుక విప్లవ రాజకీయాలు ఒక్క క్షణం ఆగి ఆ వ్యక్తి నుంచీ, ఆయన జీవితం నుంచీ, ఆయన తాత్విక దక్పథం నుంచీ నేర్చుకోవలసినది ఏమన్నా ఉందా లోతుగా ఆలోచించవలసి ఉంది. తామే సాధించి పెడతామనే వైఖరులనూ, పాక్షిక ఆధిపత్యాలనూ, లక్ష్యాలను అనుచితంగా సాధనాలకన్న పైన పెట్టడాన్నీ వదులుకునే దిశగా పోరాటాలు ముందుకు సాగవలసి ఉంది.